ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 11 అక్టోబరు 2025



'తిరుప్పరంగుండ్రం కొండ' అనే పిలవాలి

సికిందర్ దర్గాలో మేకలు, కోళ్లు బలిపై నిషేధం

నెల్లితోపు వద్ద ప్రార్థనలు చేసుకోవచ్చు

హైకోర్టు తీర్పు

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా వివాదానికి కారణమైన తిరుప్పరంగుండ్రం వ్యవహారంపై హైకోర్టు స్పష్టత ఇచ్చింది. ఆ ప్రాంతాన్ని తిరుప్పరంగుండ్రం కొండ అనే పిలవాలని, మరే ఇతర పేర్లూ వినియోగించరాదని స్పష్టం చేసింది. అంతేగాక సికిందర్ దర్గాలో మేకలు, కోళ్లు బలివ్వడంపై నిషేధం విధించింది. అదే సమయంలో దర్గా సమీపంలోని నెల్లితోపు వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు మదురై ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

తిరుప్పరంగుండ్రం కొండను సికిందర్ కొండగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ హిందూ మక్కల్ కట్చి మదురై జిల్లా అధ్యక్షుడు సోలైకన్నన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కొండపై ఉన్న సికిందర్ దర్గా, దాని ముందున్న జెండా చెట్టు, జామ తోట, దర్గాకు మెట్లు, కొత్త హాలు మినహా మిగిలిన ప్రాంతాలన్నీ తిరుప్పరంగుండ్రం సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చెందినవని, బ్రిటీష్ పాలనలోనే ఈ మేరకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అందువల్ల మేకలు, కోళ్లు బలివ్వడం ద్వారా ఆ కొండను సికిందర్ కొండగా మార్చే ప్రయత్నం జరుగుతోందని, దీనిపై నిషేధం విధించాలని పిటిషనర్ అభ్యర్థించారు. అదే విధంగా హిందూ మక్కల్ కట్చి రాష్ట్ర కార్యదర్శి రామలింగం కూడా మరో పిటిషన్ దాఖలు చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా తిరుప్పరంగుండ్రం ఆలయానికి చెందిన మార్గాన్ని మూసివేయాలని, నెల్లితోపు ప్రాంతంలో ముస్లింలు ప్రార్థనలు చేయడాన్ని నిషేధించాలని కోరారు. ఇలా మొత్తం ఆరు పిటిషన్లు దాఖలు కాగా, వాటిపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ నిషాబాను, జస్టిస్ శ్రీమతి వేర్వేరు తీర్పులు వెలువరించారు. దీంతో ఈ పిటిషన్లపై విచారణను మూడవ న్యాయమూర్తికి అప్పగించారు. ఆ మేరకు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌కుమార్ కేసును విచారించి శుక్రవారం తీర్పు వెలువరించారు. తిరుప్పరంగుండ్రం కొండపై సికిందర్ దర్గాలో మేకలు, కోళ్లు బలి ఇవ్వడంపై నిషేధం విధించారు. అదే సమయంలో, సికిందర్ దర్గాకు వెళ్లే మార్గంలో నెల్లితోపు వద్ద ముస్లింలు ప్రార్థనలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కొండను తిరుప్పరంగుండ్రం కొండ అని పిలవాలని తేల్చిచెప్పారు.

---

300 ఫార్మా కంపెనీల్లో తనిఖీలు

● ఆరోగ్యమంత్రి సుబ్రమణ్యం ఆదేశం

అడయార్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 300కు పైగా ఫార్మా కంపెనీల్లో తనిఖీలు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆదేశించారు. దీంతో డ్రగ్ కంట్రోల్ అధికారులు ఫార్మా కంపెనీల్లో తనిఖీలు చేపట్టనున్నారు. ఇటీవల కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు సమీపంలోని సుంకువార్ సత్రంలో ఉన్న శ్రీసన్ ఫార్మా కంపెనీలో తయారైన 'కోల్డ్‌రిఫ్' దగ్గమందు తాగి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 22 చిన్నారులు మంది మృత్యువాతపడ్డారు. ఈ మందు తయారీలో విషపూరిత రసాయనం ఉపయోగించడం వల్లే ఇలా జరిగినట్టు పరీక్షల్లో తేలింది. ఇదే విషయంపై మధ్యప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ నుంచి వచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తక్షణం రంగంలోకి దిగి కోల్డ్‌రిఫ్ మందు విక్రయాలు, తయారీపై నిషేధం విధించారు. అయితే, ఈ వ్యవహారంపై మధ్యప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య మంత్రి మోహన్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. శ్రీసన్ ఫార్మ కంపెనీ లైసెన్సును తమిళనాడు ప్రభుత్వం ఎందుకు పునరుద్ధరించిందంటూ ప్రశ్న లేవనెత్తారు. దీనిపై రాష్ట్ర ఆరోగ్య మంత్రి సుబ్రమణ్యం వివరణ ఇచ్చారు. 'కోల్డ్‌రిఫ్' కాఫ్ సిరప్‌లో ప్రమాదకర రసాయనాలు ఉన్నట్టు తొలుత గుర్తించి అనేక రాష్ట్రాలకు అప్రమత్తం చేశామన్నారు. అయితే, కేంద్రంతో పాటు మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఈ మందుకు క్లీన్‌చిట్ ఇచ్చాయని గుర్తు చేశారు. అంతేకాకుండా, ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వివరణ ఇచ్చిందన్నారు. ఈ నెల 1న మధ్యప్రదేశ్ ఆరోగ్య శాఖ నుంచి రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ బోర్డుకు ఒక లేఖ వచ్చిందన్నారు. దీంతో సీనియర్ వైద్య నిపుణులు శ్రీసన్ ఫార్మా కంపెనీలో తనిఖీలు చేయడంతో పాటు ఆ రోజే రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్‌రిఫ్ మందు విక్రయాలపై నిషేధం విధించినట్టు పేర్కొన్నారు. ప్రజారోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మూడో తేదీ నుంచి శ్రీసన్ ఫార్మాలో ఈ మందు తయారీని నిలిపివేసినట్టు గుర్తుచేశారు. విషపూరిత మందును తయారు చేసినందుకు ఈ కంపెనీ లైసెన్సును ఎందుకు రద్దు చేయరాదో వివరణ ఇవ్వాలని శ్రీసన్ ఫార్మాకు నోటీసులు కూడా జారీ చేసినట్టు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కేవలం 48 గంటల్లో అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. అంతేకాకుండా, ఈ కంపెనీతో యజమానిపై క్రిమినల్ చర్య తీసుకునేలా స్థానిక పోలీస్ స్టేషనులో డ్రగ్ కంట్రోల్ అధికారులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ అంశంలో సరిగా తనిఖీలు చేయకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు సీనియర్ వైద్యులను సస్పెండ్ చేశారు.

---

16 నుంచి ఈశాన్య రుతుపవనాలు

● ముమ్మరంగా ముందస్తు ఏర్పాట్లు

● ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం



అన్నానగర్ మండలం పరిధిలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఐసీసీసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ

ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 16 నుంచి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం అంచనా వేసింది. ఈ రుతుపవనాలపై రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నెల 3వ వారంలో ప్రవేశించే ఈశాన్య రుతుపవనాలు డిసెంబరు వరకు కొనసాగే అవకాశముందని, వాతావరణంలో ఏర్పడే మార్పులు బట్టి మరో నెల వరకు వీటి ప్రభావం కొనసాగే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్రకు ఆనుకుని వాయవ్య పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రెండు, మూడు రోజులు స్థిరంగా కొనసాగి, అనంతరం అల్పపీడనంగా మారే అవకాశముందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఈశాన్య రుతుపవనాల ఆగమనంతో ఈ సంవత్సరం రాష్ట్రంలో అధిక శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశముంది. ఈ రోజుల్లో బంగాళాఖాతంలో వాయుగుండాలు ఏర్పడడంతో పాటు ఈదురుగాలుల వేగం కూడా పెరిగే అవకాశముంది. సహజంగా అక్టోబరు 22వ తేది ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమవుతాయి. అయితే, ఈ ఏడాది 16 నుంచి 18వ తేదీల్లోపు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం డైరెక్టర్ సెంథామరై కన్నన్ తెలిపారు. కోస్తా జిల్లాల్లో సుమారు 80 సెం.మీలకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని, ఈ రుతుపవనాలతో ఏర్పడే విపత్తులు అడ్డుకొనేలా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు...

రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 8.30 గంటల గణాంకాల ప్రకారం, గత 24 గంటల్లో తిరువణ్ణామలై జిల్లా పాలారు డ్యాం పరిసరాల్లో 123 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే ఆర్కాడులో 116 మి.మీ, సెంగంలో 109, కడవనూరు 105, తండరాపట్టు 95, ఆరణి 92, మనప్పాకం 86 మి.మీ వర్షపాతం నమోదైంది. విల్లుపురం జిల్లా సెంబేడు, వాలాజాల్లో 83 మి.మీ, ఆలైపాళయం 81, గుండేరిపల్లం76, కె.పరమత్తి 76, మిన్నల్ 74, నీలగిరి జిల్లా కొడనాడు 73, అరక్కోణం 72, తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి, పళ్లిపట్టుల్లో 70 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

కంట్రోల్ సెంటర్...

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని మూడు ప్రాంతీయ కార్యాలయాలను కలుపుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను జీసీసీ మేయర్ ప్రియ శుక్రవారం ప్రారంభించారు. జీసీసీ ప్రధాన కార్యాలయంలోని రిప్పన్ భవనంలో ముత్తమిళ్ కలైంజర్ ఎం.కరుణానిధి భవనంలో ఈ సెంటర్ ప్రారంభమైంది. ఈ కేంద్రం ఇరవై నాలుగు గంటలు పనిచేయనుంది. వర్షాకాలంలో జీసీసీ పరిధిలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, నివారణ పనులు తదితరాలను మరింత సమన్వయంతో చేసేలా ఈ సెంటర్ ఏర్పాటుచేశారు. కాగా, జీసీసీ పరిధిలోని 15 మండలాల పరిధిలో నివారణ పనులను వేగవంతం చేసేలా ఐసీసీసీ లాగా, మూడు జోన్ కార్యాలయాల్లో రీజినల్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు (ఆర్ఐసీసీసీ) ఏర్పాటు చేయనున్నట్లు బడ్జెట్ సమావేశాల్లో మేయర్ ప్రియ ప్రకటించారు. ఆ ప్రకారం, అన్నానగర్ మండల పరిధిలోని సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో రూ.3 కోట్లతో ఏర్పాటుచేసిన సెంటర్‌ను మేయర్ ప్రియ ప్రారంభించారు. ఈ సెంటర్ ద్వారా 1,000 సీసీ కెమెరాలు, 55 వర్షాకాల సెన్సార్లు, 68 వరదల సెన్సార్లు, సబ్ వేలు పర్యవేక్షించనున్నారు. ఆయా ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు చేపట్టాల్సిన నివారణ చర్యలపై అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ఈ సెంటర్ నుంచి ఆదేశాలు కూడా జారీ చేసే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, జీసీసీ కమిషనర్ జె.కుమరగురుపరన్, అసిస్టెంట్ కమిషనర్ (పనులు) వి.శివకృష్ణమూర్తి తదతరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై డీఎంకేకు నమ్మకం లేదు: ఈపీఎస్



ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంపై అధికార డీఎంకేకు నమ్మకం లేదని, అందువల్లే ఎన్నికల హామీలు విస్మరించి అవినీతి పాలన సాగిస్తోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. 'మక్కళై కాప్పోం...తమిళగత్తై మీడ్పోం' నినాదంతో ఈపీఎస్ చేపట్టిన ప్రచార యాత్ర శుక్రవారం సాయంత్రం ఈరోడ్ జిల్లాలోని మొడకుర్చి నియోజకవర్గాన్ని చేరుకుంది. అన్నాడీఎంకే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నిర్వాహకులు, బీజేపీ నేతలు సెంథిల్, సేతురామన్, టీఎంసీ మాజీ ఎమ్మెల్యే విడియల్ శేఖర్ తదితర నాయకులు, వేలాది మంది ప్రజలు తరలివచ్చిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని విస్మరించిన సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ఐదవ సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 525 హామీలలో 10 శాతం కూడా నెరవేర్చకుండా మోసం చేసిందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన స్టాలిన్, తాము అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని 100 రోజుల నుంచి 150 రోజులకు పొడిగించడంతో పాటు కార్మికుల వేతనం కూడా పెంచుతామని ఇచ్చిన హామి నెరవేర్చలేదన్నారు. చెమటోడ్చిన కార్మికులకు వేతనం పంపిణీ చేయకుండా మొండి చేయి చూపుతున్నారని విమర్శించారు. 2019లో ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాన్ని పెంచింది అన్నాడీఎంకే ప్రభుత్వమని గుర్తు చేశారు. ఇక ఎప్పుడు ధరలు పెరిగినా, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తగ్గించే చర్యలు చేపట్టింది కూడా తమ ప్రభుత్వమే అన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో టాస్మాక్‌లో రూ.1,000 కోట్ల మేర అవినీతి జరిగిందని ఈడీ ఆరోపించిందని, రోజుకు 1.5 కోట్ల మద్యం సీసాలు విక్రయిస్తూ ఒక్కోదానిపై అదనంగా రూ.10 వసూలు చేస్తున్నా స్టాలిన్ పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీతో కూటమి ఏర్పాటు చేయడంతో అన్నాడీఎంకేను చూసి డీఎంకే నేతలు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో సమర్థవంతంగా నడిపించగల నేత లేదని, అవినీతిని ప్రోత్సహించడంతో పాటు పలు పార్టీలు మారిన నేతకు కాంగ్రెస్ రాష్ట్ర పగ్గాలు అప్పచెప్పారని దుయ్యబట్టారు. అన్నాడీఎంకే హయాంలో ఈరోడ్ జిల్లాను మూడు తాలూకాలుగా విభజించి, వనరులు మెరుగుపరచడం వల్ల వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఆర్థికంగా లబ్ధిపొందారన్నారు. మొడకుర్చి నియోజకవర్గానికి రూ.4.5 కోట్లతో కొత్త పరిపాలన భవనం నిర్మించామని, రూ.16 కోట్లతో సిరువాణి తాగునీటి పథకం, రూ.648 కోట్లతో కావేరి సంయుక్త తాగునీటి పథకం, రూ.76 కోట్లతో సాగు కాలువలను నిర్మించామని ఈపీఎస్ గుర్తుచేశారు.

● రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు

అంతర్గత మౌలిక సదుపాయాలకు రూ.250 కోట్లతో ఒప్పందం



ఒప్పంద పత్రాలతో మెట్రో రైల్వేస్ సంస్థ, బీఆర్‌సీ (ఇండియా) ప్రతినిధులు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో అమలు చేస్తున్న రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా కొత్త రైల్వేస్టేషన్లలో అంతర్గత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.250 కోట్లతో బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ (ఇండియా) సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టులో మూడో మార్గంలో నిర్మించే రైల్వేస్టేషన్లలో 17 ఇన్‌గేట్లు, అవుట్ గేట్ల నిర్మాణాలను బీఆర్‌సీ సంస్థ చేపట్టనుంది. ఈ మేరకు నెహ్రూనగర్, కందన్‌చావిడి, పెరుంగుడి, దురైపాక్కం, మేట్టుకుప్పం, పీటీసీ కాలనీ, ఒక్కియంపేట, కారపాక్కం, ఓక్కియం, దురైపాక్కం స్టేషన్లలో అంతర్గత మౌలిక సదుపాయాలు కల్పించనుంది. చెన్నై మెట్రోరైల్వేస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చెన్నై మెట్రో రైల్వేస్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్ సమక్షంలో మెట్రో రైల్వేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. అర్జునన్, బీఆర్‌సీ (ఇండియా) జనరల్ మేనేజర్ టి.రవి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

బస్సును ఢీకొన్న వ్యాన్

● ఐదుగురి దుర్మరణం ● ఎనిమిదిమందికి గాయాలు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపంలో శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు దుర్మరణం చెందారు. ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. సెంగిపట్టి వద్ద తంజావూరు - తిరుచ్చి జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్‌పై శుక్రవారం వేకువజామున తంజావూరు నుంచి తిరుచ్చికి రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సు వేగంగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన టూరిస్టు టెంపో వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో టూరిస్టు వ్యాన్ నుజునుజ్జయ్యింది. ఆ వ్యాన్‌లో ప్రయాణించిన జాన్ బాస్కో, ఆరోగ్యదాస్, వ్యాన్ డ్రైవర్ జగదీశన్, నళిని, సెల్షియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వ్యాన్‌లో ప్రయాణించిన ఆరుగురు, బస్సులో ప్రయాణించిన ఇద్దురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తంజావూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. తంజావూరు ఎస్పీ రాజారాం ప్రమాద స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.



బస్సును ఢీకొనడంతో ధ్వంసమైన వ్యాన్ ముందు భాగం

జయ మృతిపై సీబీఐ దర్యాప్తు

● ప్రధాని, కేంద్ర హోంమంత్రి, సీఎంకు కేతిరెడ్డి లేఖ



కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం జయలలిత మృతిపై జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీబీఐతో దర్యాప్తు చేయించాలని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆ ముగ్గురికీ వేర్వేరుగా లేఖలు పంపించారు. జయ మృతిపై నిజాలు నిగ్గుతేల్చేందుకు 2017లో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎ.ఆర్ముగస్వామి నేతృత్వంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయగా, 2022 ఆగస్టు 27న నివేదిక సమర్పించిందన్నారు. మళ్లీ అదే ఏడాది అక్టోబరు 17న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మరో జీవో ద్వారా మరికొన్ని కీలక విషయాలు వెల్లడించిందన్నారు. జయకు ఆస్పత్రి అందించిన చికిత్సలో తీవ్ర లోపాలున్నాయని, వీకే శశికళ, డాక్టర్ కేఎస్ శివకుమార్, డాక్టర్ జె.రాధాకృష్ణన్, డాక్టర్ సి.విజయభాస్కర్ వ్యవహార శైలిపై విచారణ జరపాలని కమిషన్ సూచించిందని తెలిపారు. రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకూ ఎలాంటి చట్టపరమైన చర్యలు ప్రారంభం కాలేదన్నారు. అందువల్ల ఆర్ముగస్వామి కమిషన్ సిఫారసుల మేరకు సీబీఐతో వెంటనే దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని కేతిరెడ్డి తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

దీపావళికి కిలాంబాక్కం నుంచి ప్రత్యేక బస్సులు



- వివరాలు 6వ పేజీలో...

కఠోర శ్రమ, దేవుడి కృపే నా విజయ రహస్యం

మా నాన్నకు ఏదైనా జరిగితే ఊరుకోను!

- వివరాలు 7వ పేజీలో...

సమాచార దర్శిని

నేడు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 19 మండల కార్యాలయాల్లో ఈ నెల 11న శనివారం రేషన్ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు ఆహార సరుకుల సరఫరా మరియు వినియోగదారుల భద్రత శాఖ పేర్కొంది. శాఖా మండల అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిబిరంలో రేషన్ కార్డుల్లో పేర్లు చేర్పు, తొలగింపు, చిరునామా, సెల్‌ఫోన్ నెంబరు మార్పు తదితరాలకు వినియోగదారులు వినతిపత్రాలు సమర్పించవచ్చు. అలాగే, దుకాణాల్లో సరుకుల నాణ్యత, కొలతల్లో తేడాలు, ఇతర సమస్యలపై పిర్యాదు చేయవచ్చు.

వాటర్ బోర్డు...

చెన్నై మెట్రోవాటర్ బోర్డు గ్రీవెన్స్ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని మండల కార్యాలయాల్లో జరుగుతుంది. తాగునీటి సరఫరా, కనెక్షన్లు సహా ఇతర సమస్యలకు పరిష్కారం పొందవచ్చు.

రేపు ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరు జిల్లాల్లో ఆదివారం జాతీయ పోలియో చుక్కల మందు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు ఆరోగ్య శాఖ పేర్కొంది. 'శ్రేయస్సు కోసం రెండు చుక్కలు...పోలియో రహిత విజయం కొనసాగాలి' నినాదంతో చెంగల్పట్టు, మైలాడుదురై, తంజావూరు, తిరునల్వేలి, శివగంగ, విరుదునగర్ జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహించనున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులు సహా వివిధ ప్రాంతాల్లో ఈ శిబిరాలు జరుగుతాయి. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు.

నేడు రంగుల చేపల విక్రయ కేంద్రం ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలో రూ.53 కోట్లతో నిర్మించిన కొళత్తూర్ రంగుల చేపల విక్రయ కేంద్రాన్ని సీఎం స్టాలిన్ ఈనెల 11వ శనివారం ప్రారంభించనున్నారు. కొళత్తూర్ పరిసర ప్రాంతాల్లో సుమారు 2,000 రంగుల చేపల పెంపకం కేంద్రాలున్నాయి. రంగుల చేపల విక్రయాలను పెంచేలా విల్లివాక్కం శివశక్తి కాలనీలో వ్యాపార కేంద్రం నిర్మించారు. మూడు అంతస్తులతో 188 దుకాణాల సముదాయాన్ని సీఎం శనివారం ప్రారంభిస్తారని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

1,450 పంచాయతీ కార్యదర్శుల భర్తీకి నోటిఫికేషన్

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 1,450 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 8వ తరగతి వరకు తమిళం ఒక పాఠ్యాంశంగా చదివి ఉండాలి. సంబంధిత తాలూకాకు చెందిన వారై, తప్పులు లేకుండా తమిళం చదవడం, రాయడం తెలిసి ఉండాలి. జనరల్ విభాగం అభ్యర్థులు 18 నుంచి 31 ఏళ్లలోపు, ఎస్సీ ఎస్టీ విభాగాలకు చెందిన వారు 18 నుంచి 37 ఏళ్లలోపు ఉండాలి. దివ్యాంగుల, మాజీ సైనికుల వారసులకు 10 ఏళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంది. ఈ పోస్టులకు వేతనంగా రూ.15,900 నుంచి రూ.50,400 వరకు అందించనున్నారు. అర్హులైన వారు సంబంధిత జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిచేసి తగిన సర్టిఫికెట్లతో జిల్లా కార్యాలయాల్లో సమర్పించాలి. ఇంటర్వ్యూ ద్వారా పోస్టులు భర్తీ చేయనున్నారు. వివరాల కోసం ww-w.t-h-r-d.tn.-go-v.in లో చూడవచ్చు.

తిరుచెందూర్ ఆలయ హుండీ ఆదాయం రూ.5.28 కోట్లు

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుచెందూర్ మురుగన్ ఆలయాన్ని సందర్శించిన భక్తులు, స్వామివారికి రూ.5.28 కోట్లు కానుకలుగా సమర్పించారు. తిరుచెందూర్ ఆలయాన్ని సందర్శించే భక్తులు, ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన హుండీల్లో కానుకులు సమర్పిస్తుంటారు. ఈమేరకు సెప్టెంబరుకు సంబంధించిన హుండీల లెక్కింపు ఆలయ ప్రాంగణంలోని మండపంలో రెండు రోజులు సాగింది. రూ.5.28 కోట్లు నగదు, 1,905 గ్రాముల బంగారం, 72,255 గ్రాముల వెండి, 1,922 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

'సెంట్రల్'లో అదనంగా 89 కెమెరాలు

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో మరో 89 సీసీ కెమెరాలు చేస్తున్నారు. కొంతకాలంగా పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి, మాదక ద్రవ్యాలు, హవాలా నగదు తదితరాలను అక్రమంగా రైళ్ల ద్వారా సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు తీసుకొస్తున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకొనేలా ఇప్పటికే ప్లాట్‌ఫారాలు, ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో 134 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.ఈనేపథ్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మరో 89సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు.

ఏడుగురు విద్యార్థులకు 'ర్యాట్ ఫీవర్'

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో ర్యాట్ ఫీవర్ లక్షణాలతో ఏడుగురు విద్యార్థులు ఆసుపత్రిలో చేరారు. తిడియూర్‌లోని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు గురువారం హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరీక్షల్లో వారు ర్యాట్ ఫీవర్ లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించి, చికిత్సలు అందిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆరోగ్య శాఖ అధికారులు కళాశాల హాస్టల్‌ను తనిఖీల చేశారు. అపరిశుభ్రమైన నీటి వినియోగం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు గుర్తించారు. అలాగే, ఆహార భద్రత శాఖ అధికారులు హాస్టల్‌ను తనిఖీ చేసి ఆహార పదార్థాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో, పరిశుభ్రమైన సౌకర్యాలు కల్పించే వరకు కళాశాలను మూసివేయాలని నోటీసులు జారీచేశారు. అలాగే, కళాశాల ప్రాంగణంలోని రెండు రెస్టారెంట్ల లైసెన్స్ రద్దు చేశారు.

నయినార్ నాగేంద్రన్ ప్రచార ప్రారంభోత్సవం

నడ్డాకు బదులుగా నిర్మలా సీతారామన్



మదురైలో బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ జరపనున్న ప్రచార పర్యటన కోసం శుభముహూర్త స్తంభ స్థాపనలో పార్టీ నాయకులు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఈ నెల 12న మదురైలో 'తమిళనాడు తలెత్తుకునేలా తమిళుడి పయనం' పేరుతో అసెంబ్లీ ఎన్నికల ప్రచార యాత్రను ప్రారంభించనున్నారు. ఈ యాత్రను బీజేపీ జాతీయ కమిటీ అధ్యక్షుడు నడ్డా ప్రారంభిస్తారని పార్టీ నాయకులు ప్రకటించారు. అయితే అనివార్య కారణాల వల్ల జెడ్డా మదురై పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు బదులుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ యాత్రను ప్రారంభించనున్నారు. నాగేంద్రన్ మూడు విడతల్లో ఈ ప్రచారం నిర్వహించనున్నారు. మొదటి విడత ప్రచారాన్ని శుక్రవారం ఉదయం మదురైలో బీజేపీ రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి కేశవ వినాయకం ఆధ్వర్యంలో పందిరి నిర్మాణం కోసం శుభ ముహూర్త స్తంభ స్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం శీనివాసన్, కార్యదర్శి కదలి నరసింగపెరుమాళ్, జిల్లా నేతలు మారి చక్రవర్తి, రాజసింహన్, శివలింగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంశీనివాసన్ మాట్లాడుతూ... ప్రచారంలో అన్నాడీఎంకే సీనియర్ నాయకులు కూడా పాల్గొంటారన్నారు.

దీపావళికి కిలాంబాక్కం నుంచి ప్రత్యేక బస్సులు



ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి కుంభకోణం ప్రభుత్వ రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.దశరథన్ ప్రకటించారు. పండుగ రద్దీలో ప్రజలు ఇబ్బంది పడకుండా గమ్యస్థానాలకు చేరుకునేలా కుంభకోణం రవాణా విభాగం కిలాంబాక్కం నుంచి తిరుచ్చి, పెరంబలూరు, దురైయూర్, కరూర్, పుదుకోట, కారైకుడి, రామనాథపురం, మదురై ప్రాంతాలకు 5వ నెంబరు ప్లాట్‌ఫారం నుంచి బస్సులు నడుపుతుందని తెలిపారు. కుంభకోణం, తంజావూరు, పుదుకోట, మన్నార్‌గుడి, నన్నిలం, నాగపట్టినం, కారైక్కాల్, వేలాంకన్ని, మైలాడుదురై, తిరువారూరు, తిరుత్తురైపూండి, వేదారణ్యంకు వెళ్లే బస్సులు నెం.7 ప్లాట్‌ఫారం నుంచి, అరియలూరు, జయంకొండాం బస్సులు నెం.8 ప్లాట్‌ఫారం నుంచి బయల్దేరనున్నాయని తెలిపారు. ఈ నెల 16న 82 ప్రత్యేక బస్సులు 17న 702, 18న 652, 19వ తేదీన 252 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అలాగే, తిరుచ్చి నుంచి తంజావూరు, కుంభకోణం, తిరువారూరు, నాగపట్టినం, పుదుకోట, మదురై, మేలూరు, కోయంబత్తూర్, తిరుప్పూర్, తిరుచ్చి తదితర ప్రాంతాలతో పాటు ప్రధాన నగరాల నుంచి 16న 150 ప్రత్యేక బస్సులు, 17, 18, 19 తేదీల్లో మొత్తం 900 ప్రత్యేక బస్సులు నడపనున్నామన్నారు. అలాగే, పండుగ ముగించుకుని తిరిగొచ్చే వారి కోసం ఈ నెల 21, 22, 23 తేదీల్లో అదనపు బస్సులు నడుపనున్నామన్నారు. టిక్కెట్లు రిజర్వేషన్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

కేసు నుంచి తప్పించండి

● మాజీ మంత్రి పిటిషన్

ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన మోసం కేసు నుంచి తప్పించాలని కోరుతూ మాజీ మంత్రి కేటీ రాజేంద్ర బాలాజి తరపున శ్రీవిల్లిపుత్తూర్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ నవంబరు 21వ తేదీకి వాయిదాపడింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో పాడి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న రాజేంద్ర బాలాజి, ఆవిన్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి వద్ద రూ.30 లక్షలు తీసుకుని మోసం చేశారని సాత్తూర్‌కు చెందిన రవీంద్రన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రాజేంద్ర బాలాజి సహా 8 మందిపై 2021 నవంబరులో విరుదునగర్ ఆర్థిక నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజున పౌష్టికాహారం, సహకార, ఆవిన్, పంచాయతీ రాజ్ తదితర శాఖల్లో ఉద్యోగాల కోసం రూ.3 కోట్లు తీసుకున్నట్టు విజయ్ నల్లతంబి ఫిర్యాదు మేరకు రాజేంద్ర బాలాజి సహా ఏడుగురిపై మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులపై విచారణ జరిపిన పోలీసులు, గత ఏప్రిల్ 15న రాజేంద్ర బాలాజిపై ఛార్జిషీటు దాఖలు చేశారు. రాజేంద్ర బాలాజి ప్రజా ప్రతినిధి కావడంతో ప్రత్యేక కోర్టులో జూలై నుంచి విచారణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో, శ్రీవిల్లిపుత్తూర్ అవినీతి నిరోధక విభాగం ప్రత్యేక కోర్టులో ఈ కేసు విచారణ శుక్రవారం జరిగింది. విచారణకు రాజేంద్ర బాలాజి తరపున హాజరైన న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌లో... రాజేంద్ర బాలాజీని కేసు నుంచి విడిపించాలని కోరగా, నవంబరు 21వ తేది పిటిషన్‌పై విచారణ చేపడతామని జిల్లా జడ్జి జయకుమార్ పేర్కొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ మానవహారం



మానవహారం ప్రారంభోత్సవంలో ప్రముఖులు

అడయార్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని ఆర్‌బీ గోతి జైన్ మహిళా కళాశాలలో అతి పొడవైన మానవహారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రాండ్ యూనివర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసింది. 1600 మందికి పైగా విద్యార్థులు, విద్యావేత్తలు, ఆరోగ్య సంరక్షణా నిపుణులు మానవహారంలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమాన్ని కొళత్తూరులోని ప్రశాంత్ హాస్పిటల్స్, లయన్స్‌క్లబ్ - రెడ్‌హిల్స్ కింగ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైకాలజీ సహకారంతో గోతి జైన్ కాలేజీ నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మహాలక్ష్మి మాట్లాడుతూ.. ఈ లక్ష్యం కోసం ఇంతమంది కలిసి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ మానవ హారం ఐక్యతా శక్తిని, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సమష్టి బాధ్యతను, ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రశాంతి హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జి.ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో సమానమని,అయినా చాలామంది దీని పట్ల అశ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందన్నారు.

లోక్‌సభ ఎన్నికల కేసు

● కోర్టుకు హాజరైన ఓపీఎస్

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల కేసులో, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) మద్రాసు హైకోర్టుకు స్వయంగా హాజరై, పత్రాలు దాఖలుచేశారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రామనాథపురం నియోజకవర్గం నుంచి డీఎంకే కూటమి తరపున పోటీ చేసిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థి నవాజ్ ఘనీ, తన ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఓపీఎస్‌పై 1,66,782 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నవాజ్ ఘనీ గెలుపును వ్యతిరేకిస్తూ మద్రాసు హైకోర్టులో ఓపీఎస్ పిటిషన్ దాఖలుచేశారు. పిటిషన్‌లో... నవాజ్ ఘనీ తన నామినేషన్ పత్రంలో నిజమైన సమాచారం అందించలేదని, ఎన్నికల సమయంలో అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి కార్తికేయన్ గురువారం విచారించగా, పన్నీర్‌సెల్వం నేరుగా హాజరై, కేసుకు సంబంధించి 38 పత్రాలు దాఖలుచేశారు. ఆ సమయంలో నవాజ్ ఘనీ తరపున న్యాయవాది... ఓపీఎస్ దాఖలుచేసిన కొన్ని పత్రాల్లో లోపాలు ఉన్నాయని, సరిగా లేవని వాదించారు. ఇరుతరపు వాదనల అనంతరం, లోపాలు సవరించి పూర్తి పత్రాలు సమర్పించాలని పన్నీర్‌సెల్వంను ఆదేశిస్తూ, తదుపరి విచారణ ఈ నెల 29వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బీజేపీ ప్రచార సభలో అన్నాడీఎంకే

ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఈనెల 12న ప్రారంభం కానున్న బీజేపీ ప్రచార సభలో అన్నాడీఎంకే పాల్గొంటుందని మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడు నెలలే ఉన్న నేపథ్యంలో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, టీవీకే తదితర పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి ప్రచారం చేపట్టాయి. మదురైలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తన ప్రచార పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో మదురై అన్నానగర్ అంబికా థియేటర్ జంక్షన్ ప్రాంతంలో వేదిక నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అన్నాడీఎంకే తరపున మదురై జిల్లా కార్యదర్శులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని పళనిస్వామి తెలిపారు.

నేటినుంచి రామేశ్వరం జాలర్ల నిరవధిక సమ్మె

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం జాలర్లు ఈనెల 11న శనివారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. రామనాథపురం జిల్లా రామేశ్వరానికి చెందిన 30 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసింది. జాలర్లు దేశ సరిహద్దుల్లోనే చేపల వేట సాగించగా, నిబంధన అతిక్రమించి సరిహద్దులు దాటారని శ్రీలంక నావికా దళం బెదిరించి వారిని అరెస్ట్ చేసిందని జాలర్ల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో, అరెస్ట్ చేసిన జాలర్లను శ్రీలంకలోని మన్నార్ కోర్టులో హాజరుపరచగా, ఈనెల 23వ తేది వరకు రిమాండ్ విధించింది. ఈ క్రమంలో, శ్రీలంక నావికా దళం అమానుష దాడులు అధికమవుతున్నాయని,అడ్డుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని జాలర్ల సంఘాలు మండిపడుతున్నాయి. శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లను, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా చర్యలు చేపట్టాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు జాలర్ల సంఘాల సమాఖ్య ప్రకటించింది.

స్టార్ ఉడ్ టవర్స్‌లో సెడార్ టవర్ ప్రారంభం

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ నవీన్స్ స్థానిక మేడవాక్కంలోని తన ఐకానిక్ నవీన్స్ స్టార్ ఉడ్ టవర్స్ కమ్యూనిటీలో చివరి టవర్ నవీన్స్ సెడార్‌ను ప్రారంభించింది. సెడార్ 9.85 ఎకరాల స్టార్ ఉడ్ టవర్స్ ఎన్‌క్లేవ్ శిఖరం. ఇది ఇప్పటికే 750 కంటే ఎక్కువ కుటుంబాలతో అభివృద్ధి చెందుతున్న కమ్యూనిటీకి నిలయం. దీనిపై నవీన్స్ ఎండీ విశ్వజిత్‌కుమార్ మాట్లాడుతూ.. నవీన్స్‌లో నేటి కుటుంబాల అవసరాల మేరకు ఇళ్లను సృష్టించడానికి తాము నిరంతరం ఆవిష్కరణలు చేస్తామని తెలిపారు. తాము కేవలం ఇళ్లను నిర్మించడం లేదని, స్వేచ్ఛ, సౌకర్యంతో జీవించడానికి స్ఫూర్తినిచ్చే వాతావరణాన్ని నిర్మిస్తున్నామని వివరించారు.

ఉన్నత విద్యాశాఖపై గవర్నర్ ఒత్తిడి

● మంత్రి కోవి చెళియన్ ఆరోపణ

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యా శాఖపై గవర్నర్ ఒత్తిడి తెస్తున్నారని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ ఆరోపించారు. తిరుచ్చిలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధికంగా ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొనడం అర్థ రహితమన్నారు. డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత 2,700కు పైగా గౌరవ ప్రొఫెసర్లు, 2,700కు పైగా శాశ్వత ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అందువల్ల ఖాళీలు అన్న మాటకు స్థానం లేదన్నారు. విశ్వవిద్యాలయాలు ఆమోదించిన వేతనాలతో పాటు, ఆర్థిక వనరులు లేని కొన్ని కళాశాల ప్రొఫెసర్లకు వేతనాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు గవర్నర్ అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కుంభకోణంలో కలైంజర్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరిస్తున్నారన్నారు. అలాగే, అన్ని ప్రభుత్వ పథకాలు, బిల్లులను గవర్నర్ అడ్డుకోవడం తమిళనాడులో మాత్రమే జరుగుతోందని మంత్రి చెళియన్ విమర్శించారు.

పొన్నై డ్యాం నుంచి అదనపు జలాల విడుదల

● తీరప్రాంత ప్రజలకు హెచ్చరిక



వేలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలో కురుస్తున్న వర్షాల కారణంగా పొన్నై డ్యాంకు నీటి చేరిక పెరిగింది. దీంతో డ్యాం భద్రత దృష్ట్యా 640 ఘనపుటడుగుల జలాలు విడుదల చేస్తుండడంతో, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి కోరారు. వర్షాల కారణంగా పొన్నై డ్యాం పరిసరాల్లో ఉన్న 18 చెరువులు పూర్తిస్థాయికి చేరుకున్నాయి.

పలు ప్రాంతాలు జలమయం... : పేర్నాంబట్టు, గుడియాత్తం పరిసర ప్రాంతాల్లో గురువారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం శుక్రవారం కూడా కొనసాగింది. దీంతో, పేర్నాంబట్టులోని ఖాజీ వీధి, నియమత్ వీధి, మహ్మద్ అలి రెండోవీధి, ఇస్లామీయవీధి, చిన్నబజారువీధి, ఖాయిదేమిల్లై నగర్, మసీదు వీధుల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు.

ఘనంగా 'ముప్పేరుం వేడుకలు'



వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి, వళ్లలార్ రామలింగస్వామి 202వ జయంతి వేడుకలు అని 'ముప్పేరుం వేడుకలు' శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు ఆనందన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర నిర్వాహకుడు చంద్రశేఖరన్ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి పురుషోత్తమన్, ఉప కోశాధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. సంఘం ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలను సంఘ కార్యదర్శి మనోహరన్ చదివి వినిపించారు. ఇటీవల పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను సన్మానించారు. సుధాకరన్, నాగరాజన్, సోమసుందరం, రఘునాథ్, ఏకాంబరం, జయరామన్ పాల్గొనగా, కార్యకర్తల కమిటీ సభ్యులు ధ్రువన్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం

వేలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యకళాశాల, దేశీయ వలంటీర్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించగా, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రోహిణి దేవి, సూపరింటెండెంట్ తిలగమ్, కళాశాల ఉప ప్రిన్సిపాల్ గౌరి, లెక్చరర్లు రవిచంద్రన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమలో 100 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసిన వారిని అభినందించి షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.



నీటి వనరుల్లో ప్రభుత్వ కార్యాలయాలా?

● అధికారులపై చర్యలకు హైకోర్టు ఆదేశం

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నీటి వనరుల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ సర్క్యులర్ జారీచేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, సంబంధిత అధికారుల నుంచి ఆర్థిక నష్టాలను వసూలు చేస్తామని పేర్కొంటూ సర్క్యులర్ జారీ చేయాలని ఆదేశించింది. నీటివనరుగా నమోదు చేసుకున్న భూమిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తోందంటూ మైలాడుదురైకు చెందిన ప్రకాశం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని విచారించిన హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది. నీటివనరుల్లో నిర్మించిన కార్యాలయాల తరలింపునకు సంబంధించి 8 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

రేబిస్‌తో రైతు మృతి

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో రేబిస్ లక్షణాలతో రైతు మృతిచెందాడు. పుదుశానిపూండికి చెందిన జాన్ ఆండ్రూస్ (48) కొద్ది నెలల క్రితం వీధి కుక్క కరిచింది. ఆయన ఎలాంటి ప్రథమ, వైద్య చికిత్సలు చేయించుకోలేదు. కొద్దిరోజుల క్రితం ఆండ్రూస్ శరీరంలో మార్పులు వెలుగు చూడడంతో కుటుంబ సభ్యులు అతన్ని ఈ నెల 8న కోళక్కుడి పీహెచ్‌సీకి తీసుకుకెళ్లారు. ప్రాథమిక చికిత్సల అనంతరం తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా, రేబిస్ నిర్ధారణ అయింది. చికిత్సలు ఫలించక గురువారం సాయంత్రం ఆండ్రూస్ మృతి చెందాడు, కాగా, తిరువణ్ణామలై జిల్లాలో ఈ సంవత్సరం 10,479 మంది కుక్కకాటుకు గురికాగా, వారిలో ముగ్గురు మృతి చెందినట్లు జిల్లా ఆరోగ్య శాఖ తెలిపింది.

వ్యాయామం చేస్తూ ప్లస్‌టూ విద్యార్థి మృతి



మహ్మద్ ఫాహిం (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం చేస్తూ విద్యార్థి మృతిచెందాడు. రామనాథపురం జిల్లా ఏర్వాడికి చెందిన మహ్మద్ ఫాహిం(17) ఆ ప్రాంతంలోని ఓ పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్నాడు. ప్రతిరోజు పాఠశాల ముగిసిన వెంటనే దర్గా ప్రాంగణంలో వ్యాయామం చేస్తుంటాడు. గురువారం సాయంత్రం వ్యాయామం చేస్తుండగా స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతన్ని వెంటనే అంబులెన్స్‌లో కీలక్కరై ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రౌడీ నాగేంద్రన్ పోస్టుమార్టంపై అనుమానాలు

● భార్య పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మాజీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు, రౌడీ నాగేంద్రన్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అతడి భార్య దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. గత కొంతకాలంగా తీవ్ర అస్వస్థతకు గురై స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన నాగేంద్రన్ గురువారం ఉదయం మృతి చెందాడు. అతడి అంత్యక్రియలను జరిపేందుకు జైలు శిక్షను అనుభవిస్తున్న కుమారులు అశ్వత్థామన్, అజిత్ పెరోల్‌పై విడుదలయ్యారు. పోలీసు భద్రత నడుమ నాగేంద్రన్ మృతదేహానికి శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితుల్లో నాగేంద్రన్‌కు ప్రభుత్వ డాక్టర్లు జరిపిన పోస్టుమార్టంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అతడి భార్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన న్యాయమూర్తి సతీష్‌కుమార్ ప్రభుత్వ డాక్టర్లు జరిపిన పోస్టుమార్టం వైద్యనిబంధనలకు అనుగుణంగానే జరిగాయన్నారు. అలాగే పోస్టుమార్టం జరిగిన తీరును వీడియో తీసి భద్రపరిచారని, దీనిపై అనుమానాలు వ్యక్తం చేయడం సబబు కాదంటూ పిటిషన్‌ను తోసిపుచ్చారు.


కేసు రద్దు చేయాలంటూ ఆదవ్ అర్జున పిటిషన్

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన కేసు రద్దు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున తరపున పిటిషన్ దాఖలు చేశారు. కరూర్ విషాద ఘటనలో, టీవీకే నాయకులు అరెస్టయిన నేపథ్యంలో ఆదవ్ అర్జున, తన సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ పెట్టారు. ఈ వ్యవహారానికి సంబంధించి, ఆదవ్ అర్జునపై చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అల్లర్లు ప్రేరేపించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడం వంటి సెక్షన్లపై ఆదవ్ అర్జునపై పోలీసులు కేసు నమోదుచేశారు. తనపై నమోదు చేసిన కేసు రద్దు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో ఆదవ అర్జున పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లో 'ఒక రాక్షసుడు పాలిస్తే, శాస్త్రాలు శవాన్ని తింటాయి' అనే భారతీయార్ పంక్తులు హింసను ప్రేరేపించడానికి ఉద్దేశించ లేదు, నేను ఆ పంక్తులను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశా. వివాదాస్పదం కావడంతో 34 నిమిషాల్లో తొలగించా. ప్రజా శాంతికి భంగం కలిగించే ఉద్దేశంతో పోస్ట్ చేయలేదు' అంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

పుళల్ జైలు నుంచి దుష్యంత్ విడుదల

ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): 'హత్యాచారం' కేసులో అరెస్టయిన దుష్యంత్, సుప్రీంకోర్టు ఉత్తర్వులతో పుళల్ సెంట్రల్ జైలు నుంచి గురువారం విడుదలయ్యాడు. 2017లో ఆరేళ్ల బాలికపై లైంగికదాడి చేయడంతో పాటు, ఆమెను హతమార్చిన కేసులో దుష్యంత్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అతను కొద్దిరోజులకు బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే మాదకద్రవ్యాల విక్రయానికి డబ్బులివ్వలేదన్న కోపంతో తల్లిని దారుణంగా హతమార్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో అతన్ని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. చెంగల్పట్టు మహిళా కోర్టు ఈ కేసులపై విచారణ జరిపింది. తల్లి హత్య కేసులో సరైన ఆధారాలు లేకపోవడం, తండ్రి తప్పుడు సాక్షిగా మారారన్న కారణంగా దశ్వంత్‌ని ఆ కేసు నుంచి విడుదల చేసింది. అదే సమయంలో బాలికపై అత్యాచారానికి పాల్పడి హతమార్చిన కేసులో ఉరిశిక్ష విధించింది. ఆ తరువాత మద్రాసు హైకోర్టు చెంగల్పట్టు మహిళా కోర్టు విధించిన ఉరిశిక్షను ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో దశ్వంత్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసులో సమర్పించిన వీడియో ఆధారాలు, సీసీ కెమెరా దృశ్యాలు నేరాన్ని రుజువు చేసేలా లేవని, డీఎన్ఏ పరీక్షల్లోనూ తేడాలున్నాయని పేర్కొంటూ దుష్యంత్‌ను ఈ కేసు నుంచి విడుదల చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేసింది.

ఉధృతంగా కుశస్థలి



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

తిరుత్తణి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు పరిసర ప్రాంతాల్లో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వరాలు కురుస్తున్నాయి. పళ్లిపట్టులో 70 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ కారణంగా కుశస్థలి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లో నేల వంతెనలపై నీరు ప్రవహించింది. అదే సమయంలో, ఆంధ్ర రాష్ట్రం కృష్ణాపురం జలాశయం నుంచి విడుదల చేసిన అదనపు జలాలు కూడా కుశస్థలి నదిలో చేరడంతో నీటి ఉధృతి మరింత పెరిగింది. సమంతవాడలోని కాజ్‌వే కొట్టుకుపోవడంతో, సమంతవాడ, జ్ఞానమ్మాల్‌పట్టడైలకు రాకపోకలు స్తంభించాయి. నేల వంతెన స్థానంలో హై లెవల్ వంతెన ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సప్తగిరి ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఆవులు మృతి



రైలుపట్టాలపై కళేబరం

తిరుత్తణి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మున్సిపాలిటీలోని రైల్వే గేటు వద్ద సప్తగిరి ఎక్స్‌ప్రెస్ ఢీకొని రెండు ఆవులు మృతిచెందాయి. చెన్నై నుంచి తిరుపతికి వెళ్తున్న సప్తగిరి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఈ ప్రాంతానికి చేరుకున్న సమయంలో పట్టాలు దాటేందుకు యత్నిస్తున్న రెండు ఆవులను రైలు ఢీకొనడంతో మృతిచెందాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులతో అక్కడకు చేరుకుని పట్టాలపై ఉన్న కళేబరాలను తొలగించారు. ఈ కారణంగా సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 15 నిమిషాలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది.



తరుణి

'మీరొక మారుమూల పల్లెకు చెందినవారైనా సరే మీలో కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలరు. మీ ఆలోచనలను సమాజాభివృద్ధి దిశగా విస్తరిస్తే ప్రపంచాన్నే మీ వైపు తిప్పుకోగలరు. ఉన్నత లక్ష్యాల సాధనకు అవకాశాలను అన్వేషించకపోవడమే ప్రధానమైన అడ్డంకి. అలా ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యాన్ని సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించాలి. పరిశోధన అనేది అద్భుతమైన కళ. అది సమాజం పట్ల బాధ్యతల్ని మరింతగా పెంచుతుంది. సమాజానికి మంచి చేయాలనుకునేవారు అడ్డంకులను అధిగమించి తమ రంగంలో పురోగతి సాధించాలి. అప్పుడే నిజమైన మార్పు వస్తుంది.'

- మైనింగ్ వ్యర్థాలను ఇసుకకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించడంపై అంతర్జాతీయస్థాయి పరిశోధనలు సాగిస్తున్న డాక్టర్ రాజప్రియ భావితరాలకు స్ఫూర్తిదాయకమైన ఆత్మవిశ్వాసంతో చెబుతున్న మాటలివి...

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



పరిశోధనలతో 'రాజప్రియ' ప్రపంచ ఖ్యాతి

- ఇసుకకు ప్రత్యామ్నాయంగా సౌరంగ వ్యర్థాలు
- రూ.2.8 కోట్లతో ఫిన్లాండ్‌లో రెండేళ్ల రీసెర్చికి శ్రీకారం

ఆత్తూరులో ఓ కుగ్రామం నుంచి ప్రారంభమైన డాక్టర్ రాజప్రియ పరిశోధనాత్మకమైన జీవనయానం బ్రెజిల్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ దాకా విస్తరించి, ప్రపంచ విద్య, పరిశోధనలతో ప్రత్యేకమైన ప్రయాణంగా కొనసాగుతోంది. పరిశోధన రంగంలో ఎన్నో విజయాలు సాధించిన డాక్టర్ రాజప్రియ తన పరిశోధనాత్మక జీవన ప్రస్థానం వివరాలు ఆమె మాటల్లోనే...

పేద రైతు కుటుంబం నుంచి...

'సేలం జిల్లా ఆత్తూరు గ్రామంలో ఓ పేద రైతు కుటుంబం మాది. రెండేళ్ల వయస్సులో నాన్నగారిని కోల్పోయా. కొంతకాలం మా తాతగారు కుటుంబాన్ని పోషించారు. ఆయన ఓ ప్రమాదంలో చనిపోయారు. మా కుటుంబ పరిస్థితులు అధ్వానంగా మారాయి. అయినా అమ్మ ఒంటరిగానే కష్టనష్టాలను తట్టుకుని నన్ను అల్లారుముద్దుగా పెంచింది. మా అమ్మ ఒక వైపు ఆవులను పోషించడం, మరో వైపు పాలవ్యాపారం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. ఆమె కష్టాలను చూసి ఉన్నతస్థితికి రావాలనే తలంపు నాలో బలంగా నాటుకుంది. అప్పటిదాకా మా కుటుంబంలో ఎవరూ ప్రాథమిక విద్యను దాటి ఉన్నత చదువులు చదవలేదు. అయితే చుట్టుపక్కలవాళ్లు ఆడపిల్లకు ఎందుకు ఉన్నతమైన చదువులు అంటూ అమ్మను నిరుత్సాహపరిచేవారు. ఆ మాటలను పట్టించుకోని అమ్మ నన్ను బాగా చదివించారు. 'బాగా చదివి అభివృద్ధి చెంది మన జీవితాలను మార్చాలి' అంటూ తరచూ చెబుతుండేది. అమ్మను చూసే నాలో ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం బలంగా నాటుకున్నాయి.'

భవన నిర్మాణ వ్యర్థాలతో సిమెంట్ తయారీ...

'భవన నిర్మాణ వ్యర్థాలను సిమెంట్‌గా మార్చే దిశగా నా పరిశోధనలు కొనసాగాయి. నా పరిశోధనల ఫలితాలు పర్యావరణ పరిస్థితులకు హాని కలిగించవు. అధిక, అనవసర ఖర్చులను తగ్గించగలుగుతాయి. నా పరిశోధన ఫలితాలు విప్లవాత్మకమైన మార్పులు కలిగించడం తథ్యం' అంటూ రాజప్రియ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'మూడేళ్లలో పూర్తి చేయాల్సిన పీహెచ్‌డీ నాలుగేళ్లు పట్టింది. ఆర్థిక సమస్యలు, సామాజిక ఒత్తిళ్లు అధికమయ్యాయి. విద్యారుణాలిచ్చిన బ్యాంక్ మేనేజర్లు కూడా నిరుత్సాహపరిచారు. అయినా పట్టువదలకుండా పరిశోధనలు ముగించాను. ఆ సమయంలోనే 10 పరిశోధన పత్రాలు ప్రచురించి, వాటిపై భారతీయ పేటెంట్ పొందాను. మా కుటుంబంలో నేనిపుడు మొదటితరం గ్రాడ్యుయేట్ మాత్రమే కాదు. పీహెచ్‌డీ పూర్తి చేసిన మొదటి తరం 'డాక్టర్ రాజప్రియ'ను అంటూ నవ్వుతూ తెలిపారు.



ఇక రాజప్రియ విద్యారుణాలను తిరిగి చెల్లించే దిశగా కేంద్ర ప్రభుత్వ పరిశోధన కేంద్రంలో రెండేళ్లపాటు పనిచేశారు. రాజప్రియ తన పరిశోధనలను విస్తరించడానికి ప్రతిరోజూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న 300 నుంచి 400 మంది ప్రొఫెసర్లకు లింక్డ్‌ఇన్‌లో ఈ మెయిల్స్ పంపుతుంటారు. ఫలితంగా ఆమెకు బ్రెజిల్ ప్రభుత్వం నుం,ఇ ప్రతిష్ఠాత్మక ఫెల్లోషిప్ లభించింది. అవకాశాలను అన్వేషించకపోవడమే ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రధానమైన అడ్డంకి అని ఆమె చెబుతారు. 'ఇక చాలు...' అనే కంఫర్ట్‌జోన్‌ను దాటుకుని మన ఆలోచనలు విస్తరిస్తే ప్రపంచాన్నే మన వైపు తిప్పుకోగలం' అని రాజప్రియ తరచూ చెబుతుంటారు. సహచర విద్యార్థులలో చాలా మంది ఎక్కువగా సంపాదిస్తున్నప్పుడు చదివిన చదువులకు ఏదైనా ఉన్నత ఉద్యోగంలో చేరమని సలహాలు ఇచ్చేవారని చెబుతూ పరిశోధన రంగంలో ఎదగడానికి ఓపిక చాలా అవసరమని ఆమె తెలిపారు. తన లక్ష్యం పెద్దదని, దానికి చాలా సమయం పడుతుందని ఆమె భావిస్తున్నారు. 'ఓర్పుతో వేచి ఉండటం, కష్టపడి పనిచేయడమే మీ విజయానికి పెట్టుబడులు' అని భావితరం పరిశోధకులకు ఆమె సలహా ఇస్తున్నారు. రాజప్రియ పరిశోధనలకు ఆమె భర్తకూడా అండగా నిలుస్తున్నారు. తనను కష్టపడి పెంచి పెద్ద చేసి, ఉన్నత చదువులు చదివేందుకు పాటుపడిన తల్లిని కంటికి రెప్పలా కాపాడుకోవడం తన ప్రధాన బాధ్యత అని ఆమె తెలిపారు.



రూ.2.8 కోట్ల ఫెలోషిప్‌తో పరిశోధనలు...

గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో చదివిన రాజప్రియ చదువులో రాణించింది. టెన్త్‌లో 95 శాతం మార్కులు, ప్లస్-2లో 92 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలయ్యారు. ఆ తర్వాత ఏం చదవాలో ఆమెకు బోధపడలేదు. దూరపు బంధువు ఒకరు ఆమెను సివిల్ ఇంజనీరింగ్ చదవమని సలహా ఇచ్చారు. ఆ ప్రకారమే విద్యారుణం పొంది చెన్నైలోని జెరూసలేం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 83 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి కుటుంబంలోనే మొదటితరం పట్టభద్రురాలిగా పేరుగడించారు. మళ్లీ ఇరుగుపొరుగు వారంతా ఇక చదువులకు ఫుల్‌స్టాప్ పెట్టమని రాజప్రియ అమ్మపై ఒత్తిడి చేశారు. అయినా రాజప్రియ ఆ కాలేజీలోనే ఎంఈ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు చదివారు. ఆ తర్వాత ఆమెకు అన్నా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పరిశోధనకు అన్నా సెంటినరీ రిసెర్చ్ ఫెలోషిప్ లభించింది. నిర్మాణ రంగంలో సౌరంగ వ్యర్థాలను ఇసుకకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించడంపై పరిశోధనలు ప్రారంభించింది. అయితే కరోనా మహమ్మారి వ్యాప్తి వల్ల ఆమె పరిశోధన వ్యవధి అధికమైంది. బ్రెజిల్‌లో పరిశ్రమల వ్యర్థాలను కాంక్రీట్ తయారీకి ఉపయోగించే విషయమై పరిశోధనలు చేపట్టారు. 2024లో యూరోపియన్ కమిషన్‌కు అనుబంధంగా మేరీ స్కోలోడోవాస్కా- క్యూరీ యాక్షన్స్ (ఎంఎస్‌సీఏ) ఫెలోషిప్‌ను 100 మార్కులతో సాధించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రిసెర్చ్ ఫెలోషిప్‌లలో ఒకటి. ఆ ఫెలోషిప్ ద్వారా లభించిన రూ.2.8 కోట్లతో ఫిన్లాండ్‌లోని ఔలు విశ్వవిద్యాలయలో రెండేళ్ల పరిశోధనను సాగించి, ఆ తరువాత నెదర్లాండ్స్‌లో ఆరు మాసాల పారిశ్రామిక శిక్షణను కూడా పొందబోతున్నారు.



'రామ్ అబ్దుల్లా ఆంటోని' ఆడియో విడుదల కార్యక్రమం

హీరోగా 'సూపర్ సింగర్ ఫేం' పూవైయార్

- 31న 'రామ్ అబ్దుల్లా ఆంటోని' విడుదల

చిత్రజ్యోతి

'సూపర్ సింగర్ ఫేం' పూవైయార్ వెండితెరకు హీరోగా పరిచయమవుతున్నారు. అన్నై వేలాంగన్ని స్టూడియోస్ పతాకంపై నిర్మాత టి.ఎస్.క్లెమెంట్ సురేష్ నిర్మించిన 'రామ్ అబ్దుల్లా ఆంటోని'లో ఒక హీరోగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం ద్వారా టి.జయవేల్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. విద్యార్థుల జీవితాలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ వేడుక గురువారం చెన్నైలో జరిగింది. సీనియర్ దర్శకులు ఎస్.ఏ.చంద్రశేఖర్, అగత్యన్, పేరరసు, పొన్‌రామ్, నిర్మాతలు ఎస్ఆర్ ప్రభాకరన్, మదియళగన్, నటులు కూల్ సురేష్ సహా పలువురు సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.ఏ.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 'ఈ చిత్రాన్ని రూపొందించిన దర్శకుడిని ప్రతి ఒక్కరూ అభినందించాలి. చాలా మంది నేటి దర్శకులు కత్తి, రక్తం, శబ్దం అనే మూడు అంశాలను మాత్రమే నమ్ముకుని ఉన్నారు' అన్నారు. నిర్మాత మదియళగన్ మాట్లాడుతూ... 'సినీ ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉంది. డిజిటల్, ఓటీటీ వంటి ప్లాట్‌ఫాంల చేతిలో చిక్కుకుని నలిగిపోతోంది' అని పేర్కొన్నారు. హీరో పూవైయార్ మాట్లాడుతూ... 'ఈ కథను దర్శకుడు నాలుగేళ్ల క్రితమే చెప్పారు. మరో దర్శకుడైతే పరిస్థితులకు అనుగుణంగా మారిపోయుంటారు. కానీ, ఆయన ఎంతో స్ట్రాంగ్‌గా నిలబడ్డారు. సినిమాలోని ప్రతి సన్నివేశం లైవ్‌గా ఉంటుంది. నేను ఈ స్థాయిలో ఉండటానికి విజయ్ టీవీలోని పలువురు ప్రముఖులే కారణం' అని పేర్కొన్నారు. కాగా, ఈ నెల 31న విడుదలకానున్న ఈ చిత్రంలో పూవైయార్, అర్జున్, అజయ్ ఆర్నాల్డ్, వేలరామ్మూర్తి, తలైవాసల్ విజయ్, సాయిదీనా, సౌందరరాజా, కిచ్చా రవి, శామ్స్, వినోదిని, బిగ్‌బాస్ ఆర్నవ్, రాజ్‌మోహన్ తదితరులు నటించారు. గెస్ట్ అప్పీరెన్స్‌గా వనితా విజయకుమార్ కనిపిస్తారు. ఎల్‌కే విజయ్ ఛాయాగ్రహణం అందించగా, టీఆర్ కృష్ణన్ సేట్టన్ సంగీతం.

'డాన్' కాంబినేషన్ రిపీట్!

హీరో శివకార్తికేయన్, దర్శకుడు సిబి చక్రవర్తి కాంబినేషన్‌లో 'డాన్' మూవీ వచ్చింది. ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఇపుడు ఈ హిట్ కాంబినేషన్ మరోమారు రిపీట్ కానుంది. హీరో శివకార్తికేయన్ ప్రస్తుతం సుధా కొంగర దర్శకత్వంలో 'పరాశక్తి'లో నటిస్తుండగా, షూటింగ్ పూర్తి చేశాక సిబి చక్రవర్తి దర్శకత్వం వహించే చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. ఇందులో హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అనిరుధ్ రవిచందర్ సంగీతం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్నారు. ప్రస్తుతం చిత్ర ప్రీ ప్రొడక్షన్ పనుల్లో దర్శకుడు సిబి చక్రవర్తి నిమగ్నమైవున్నారు. ఇదిలా ఉండగా, 'పరాశక్తి' శివకార్తికేయన్ 25వ చిత్రం. చారిత్రక నేపథ్యంలో రూపొందుతోంది. జయం రవి, శ్రీలీల తదితరులు నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం.



సిబి చక్రవర్తి - శివకార్తికేయన్

నెల వ్యవధిలో కృతిశెట్టి నటించిన 3 చిత్రాల విడుదల

తెలుగు మూవీ 'ఉప్పెన' ద్వారా వెండితెరకు పరిచయమైన యంగ్ హీరోయిన్ కృతిశెట్టి తమిళంలో వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె నటించిన మూడు చిత్రాలు నెల వ్యవధిలో విడుదలకు సిద్ధమయ్యాయి. కార్తి నటించిన 'వా వాత్తియార్', ప్రదీప్ రంగనాథన్ హీరోగా తెరకెక్కిన 'ఎల్ఐకే', రవి మోహన్ కథానాయకుడిగా నటించిన 'జీని' నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. వీటిలో 'జీని' మినహా మిగిలిన రెండు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. 'వా వాత్తియార్' సినిమా డిసెంబరు 5న, 'ఎల్ఐకే' డిసెంబరు 18వ తేదీన విడుదలకానున్నాయి. 'జీని'ని కూడా డిసెంబరు నెలాఖరులో విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాను నటించిన తొలి చిత్రంలోనే మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న కృతిశెట్టికి తెలుగులో అవకాశాలు రాకపోగా, తమిళంలో మాత్రం వరుస ఛాన్సులు వస్తుండటం గమనార్హం.



కఠోర శ్రమ, దేవుడి కృపే నా విజయ రహస్యం

- ప్రదీప్ రంగనాథన్



'డ్యూడ్'లో ప్రదీప్ రంగనాథన్

తన విజయానికి ప్రధాన కారణం కఠోర శ్రమ, దేవుడి కృప కారణమని దర్శక, హీరో ప్రదీప్ రంగనాథన్ అన్నారు. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన తాజా చిత్రం 'డ్యూడ్'. ఈ నెల 17న తమిళం, తెలుగు భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ, 'నా విజయాల వెనుక కఠోర శ్రమ ఉంది. ప్రేక్షకులు, అభిమానుల ప్రేమ కూడా కారణం. నాలాంటి ప్రతిభావంతులు అనేక మంది ఉన్నారు. వారిని నేను చూస్తున్నా. కానీ, నా విషయంలో మాత్రం దేవుడి దయ వల్లే ఇలా జరుగుతోందని భావిస్తున్నా. అలాగే, ప్రేక్షకులు కూడా నన్ను వారిలో చూసుకుంటున్నారు' అని పేర్కొన్నారు. కాగా, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'డ్యూడ్' చిత్రంలో శరత్‌కుమార్, రోహిణి కీలక పాత్రలను పోషించారు. సాయి అభ్యంకర్ సంగీతం సమకూర్చారు. ఇదిలా ఉండగా ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే', 'డ్రాగన్'లు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరాయి. దీంతో 'డ్యూడ్'పై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

మా నాన్నకు ఏదైనా జరిగితే ఊరుకోను!

- అన్బుమణి ఆగ్రహం



చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేసుకుని ఇంటిపట్టున గడుపుతున్నారని, ఆయన ప్రశాంతతకు భంగం కలిగించేలా ఆరోగ్యానికి హాని కలిగిస్తే చూస్తూ ఊరుకోనని ఆయన తనయుడు, పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి రాందాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉత్తాండిలో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ... తన తండ్రి రాందాస్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, సాధారణ వైద్యపరీక్షలు చేసుకోవడానికే అపోలో ఆస్పత్రికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చారని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉండగా ఇంటిపట్టున ప్రశాంతంగా ఉన్న రాందాస్‌ను పరామర్శించేందుకు రండి అంటూ అనుచరులు ఎవరెవరికో ఫోన్ చేసి పిలుస్తున్నట్లు తనకు తెలిసిందని అన్నారు. అదే పనిగా వచ్చి చూడటానికి రాందాస్ ఏమైనా ఎగ్జిబిషనా?, ఆయన పరిస్థితిని సాకుగా పెట్టుకుని కొందరు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. 'నాన్న భద్రతకు భంగం వాటిల్లితే ఊరుకోను... ఆయనకు ఏమైనా జరిగినా ఊరుకోను... ఆయన అనారోగ్యంగా ఉన్నారంటూ వదంతులు పుట్టించినా ఊరుకోను' అంటూ ఆ సభలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ తన తండ్రిపై ఉన్న ప్రేమాభిమానాలను ఎలుగెత్తి చాటుకున్నారు.

నేడు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు

చెన్నై, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11న గ్రామసభలు నిర్వహించనున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ తెలిపారు.ఈ గ్రామసభలనుద్దేశించి సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు. సీఎం ప్రసంగం పదివేల గ్రామసభలలో ఎల్ఈడీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేస్తామని చెప్పారు. వీధులు, రహదారుల పేర్లలో కులాల పేర్ల తొలగింపుపై గ్రామసభల్లో తీర్మానాలు చేసుకోవచ్చన్నారు. ప్రధాన సమస్యలపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాలని చెప్పారు.

1.50 లక్షల తాటి విత్తనాలు నాటే పనులు

ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో 1.50 లక్షల తాటి విత్తనాలు నాటే పనులను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ పాలవాక్కం సముద్రంతీరంలో ప్రారంభించారు. జీసీసీ పరిధిలోని 200 వార్డుల్లో నాలుగేళ్లలో 4,26,429 ఔషధ మొక్కలు నాటి పర్యవేక్షిస్తున్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించాలన్న దృక్పథంతో జీసీసీ, 1.50 లక్షల తాటి విత్తనాలు నాటి సంరక్షించనుంది. వీటిని సముద్రతీరాలు, చెరువుల వెంబడి నాటే పనులు ప్రారంభమయ్యాయి. అలాగే, ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులతో రాష్ట్రంలో పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా తాటి విత్తనాలు నాటే పనులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

జీఎస్‌టీ తగ్గింపుతో ఎన్నో లాభాలు

- 'ఏసీసీ' సభలో అజయ్ శ్రీవాత్సవ



అతిథి అజయ్ శ్రీవాత్సవను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వల్ల ఎంతో లాభదాయకమని, ముఖ్యంగా పేద, మధ్య తరగతి ఖర్చులు తగ్గాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ అభిప్రాయపడ్డారు. ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బహుళ ధ్రువ ప్రపంచంలో ప్రపంచ వాణిజ్యం భవిష్యత్తు (వాణిజ్య సుంకాలు - ఉద్రిక్తతలు) అంశంపై 14వ జేవీ సోమయాజులు స్మారక ఉపన్యాసం స్థానిక టి.నగర్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా అజయ్ శ్రీవాత్సవ పాల్గొని జీఎస్టీ తగ్గింపు వల్ల చిన్న, మధ్య తరగతికి కలిగే లాభాలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తదితరాలు వివరించారు. అలాగే, ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వార్థపూరిత నిర్ణయాల్లో ఒకటైన భారీ పన్నుల విధానంతో భారత్‌కు ఎలాంటి నష్టం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అడిగిన ప్రశ్నలకు అజయ్ శ్రీవాత్సవ సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ముందుగా ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ ఆహ్వాన సందేశాన్ని నిర్వాహకులు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.నరసింహన్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కేఎస్ సురేష్ బాబు, మాజీ అధ్యక్షులు డాక్టర్ జె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్థూల దేశీయోత్పత్తిలో కుటుంబ యాజమాన్య వ్యాపారాలు



పుస్తకావిష్కరణలో గ్రేట్ లేక్స్ మేనేజ్‌మెంట్ సంస్థ, ఎంఎంఏ నిర్వాహకులు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో కుటుంబ యాజమాన్య వాణిజ్యాల వల్ల స్థూల దేశీయోత్పత్తి పెరుగుతోందని, దేశ ఆర్థిక వృద్ధిలో ఈ సంస్థలు కీలక పాత్రను పోషిస్తున్నాయని గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎంఎంఏ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అధ్యయనం ద్వారా వెల్లడైంది. ఈ వివరాలను చెన్నైలో ఏర్పాటు చేసిన 'కుటుంబ వాణిజ్య సదస్సు - 2025' నిర్వాహకులు ప్రకటించారు. భారతదేశంలో 300లకు పైగా వాణిజ్య కుటుంబాలు రూ.134 కోట్ల మేరకు నికర పెట్టుబడిని కలిగి 20లక్షల దాకా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తమ అధ్యయనంలో వెల్లడైనట్టు గ్రేట్‌లేక్స్ సంస్థ నిర్వాహకుడు ప్రొఫెసర్ డాక్టర్ రాజ్ కృష్ణన్ శంకర్ తెలిపారు. వీఎస్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెప్టెన్ ఆర్ విజయకుమార్, గ్లిమ్ సంస్థ సీఓఓ గౌతమ్‌లక్ష్మరాజ్, కేవిన్‌కేర్ ఎండీ సీకే రంగనాథన్, ఎంఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంపీ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ సహా 8 భవనాలకు బాంబు బెదిరింపు

అడయార్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్, డీజీపీ ప్రధాన కార్యాలయం, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో సహా మొత్తం 8 భవనాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బెదిరింపులకు పాల్పడిన నిందితుడి కోసం సైబర్ క్రైం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. స్థానిక బీచ్ రోడ్డులోని డీజీపీ కార్యాలయానికి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్, గిండీలోని రాజ్‌భవన్, కోడంబాక్కంలోని పీటీఐ కార్యాలయం, ఈక్కాట్టుతాంగల్‌లో ఉన్న ప్రైవేటు టీవీ చానెల్ కార్యాలయం సహా మొత్తం 8 ప్రాంతాల్లో బాంబులు అమర్చామని, చేతనైతే గుర్తించి నిర్వీర్యం చేసుకోవాలని హెచ్చరిస్తూ ఫోన్ కట్ చేశాడు. ఆ వెంటనే రంగంలోకి దిగిన అన్నాసాలై బాంబు స్క్వాడ్ ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేయగా, ఉత్తుత్తి బెదిరింపులని తేలింది. అదేసమయంలో ఈ బెదిరింపులకు పాల్పడిన నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు, గత రెండు నెలలుగా చెన్నైలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెల్సిందే.

విమాన ఎమర్జెన్సీ డోర్ ఓపెన్ చేసిన వైద్యుడు

అడయార్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నుంచి చెన్నైకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న విమాన ఎమర్జెన్సీ డోర్‌ను ఒక వైద్యుడు తెరిచాడు. దీంతో ప్రయాణికులు హడలిపోయారు. గురువారం రాత్రి 7.15 గంటలకు తిరుచ్చి నుంచి ఇండిగో విమానం చెన్నైకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. ఇదే విమానంలో ఉన్న తిరుచ్చిలోని ఒక ప్రైవేటు వైద్య కాలేజీకి చెందిన వైద్యుడు ఈ ఎమర్జెన్సీ డోర్‌ను తెరిచాడు. దీంతో ప్రయాణికులు, క్రూ హడలిపోయారు. ఆ తర్వాత విమాన సిబ్బంది, ప్రయాణికులంతా కలిసి ఆ వైద్యుడుని కిందికి దించేశారు. ఈ కారణంగా ఆ విమానం గంట ఆలస్యంగా తిరుచ్చి నుంచి బయలుదేరింది.

విపత్తులు, అగ్నిప్రమాదాలపై నేడు, రేపు అవగాహన

పెరంబూర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11, 12 తేదీల్లో(శని, ఆదివారాలు) అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విపత్తులు, అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అగ్ని ప్రమాదాల నుంచి ప్రాణాలు, ఆస్తులు రక్షించడం, వరదలు, తుఫానులు, కొండచరియలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, మానవ నిర్మిత విపత్తుల నుంచి తప్పించుకోవడం తదితర అంశాలపై సమీప అగ్నిమాపక శాఖ కేంద్రంలో అవగాహన కల్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 375 అగ్నిమాపక కేంద్రాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శిబిరాలు జరుగుతాయి.



నన్ను ఇప్పుడు 'ఓ.జీ' డ్రమ్మర్ అంటున్నారు

● శివమణి

తిరుమల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): 'చెన్నైలో ఉన్నప్పుడు నన్ను అందరు ఏఆర్ రెహ్మాన్ డ్రమ్మర్ అంటారు. ఇప్పుడు కొత్త ట్రెండ్ మొదలైంది. నన్ను చూడగానే 'ఓ.జీ' డ్రమ్మర్ వచ్చేశారు అంటున్నారు' అని డ్రమ్స్ శివమణి సంతోషంగా చెప్పారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం ఆయన దర్శించుకున్న ఆయన మీడియాతో మాటాడుతూ, బాలయ్య 'అఖండ-2' చిత్రం కోసం నేరుగా ముంబై వెళ్తున్నానని చెప్పారు. ఇలా ఉండగా, స్వామి దర్శించుకునే సమయంలో కూడా శివమణి చేతిలో డ్రమ్స్ స్టిక్స్ ఉన్నాయి. దీనిని చాలా మంది ఆసక్తిగా చూశారు.

ఆలయం ముందు డ్రమ్స్ స్టిక్స్‌తో శివమణి




స్వాతి (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో స్టాఫ్ నర్సు మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు స్టాఫ్ నర్సు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ ఇన్‌ఛార్జి సీఐ గోపి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు గ్రామానికి చెందిన గురవయ్య ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంటాడు. ఆయన భార్య స్వాతి(26). ఈమె శ్రీకాళహస్తిలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తుండేది. శుక్ర వారం రాత్రి విధులు ముగిసిన అనంతరం గురవయ్య భార్య స్వాతితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణ శివారు అరవకొత్తూరు సమీపంలో ముచ్చివోలు రహదారిపై వెళుతుండగా టిప్పర్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో స్వాతి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సాయంతో భర్త ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీక రించారు. భర్త, కుటుంబసభ్యులు బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,883
తలనీలాలు సమర్పించినవారు: 26,000

జిల్లా హౌసింగ్ హెడ్ దయాకర్ సస్పెన్షన్

● మరో 12 మంది కిందిస్థాయి అధికారులపై చర్యలకు సిఫార్సు

అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ (ఇన్‌ఛార్జి) పి.దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఈఈగా, ఈఈగా పనిచేసినప్పుడు కొండ్లపూడి, వెంకటేశ్వరపురం లే-అవుట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టేట్ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడి, హౌసింగ్ కార్పొరేషన్ ఖజానాకు రూ. కోట్లలో నష్టం కల్గించారని, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో కూడా విఫలమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో దయాకర్‌పై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్‌తోపాటు లే అవుట్లలో అవినీతి కార్యకలాపాల్లో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజినీరు పసుపులేటి సురేష్‌కుమార్ ((రిటైర్డ్), గొల్లపూడి రామకృష్ణ (రాపూరు), ఎ.నాగరాజు (అప్పటి డివిజన్ హెడ్-రిటైర్డ్), ఎం.వెంకటమోహనరావు (ప్రస్తుత నెల్లూరు డివిజన్ హెడ్), పల్లా వెంకటదాసు (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్ - కర్నూలు జిల్లాలో పదవీ విరమణ చేశారు), పరవస్తు నరసింహం (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్-రిటైర్డ్), తోట వెంకటశేషయ్య (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్), మొహమ్మద్ జహీరుద్దీన్ అహ్మద్ (ప్రస్తుతం సర్వేపల్లి రూరల్ సబ్ డివిజన్ డీఈఈ), పఠాన్ అహ్మద్‌బాషా, (రిటైర్డ్ ఏఈ), తాళ్లూరు భాస్కరరావు (ప్రస్తుతం మనుబోలు మండల ఏఈ), ఎం.మధుసూదనరావు (అప్పటి ఏఈ-ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు), ఎం.కృష్ణారెడ్డి (రిటైర్డ్ ఏఈ)లపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి అదనపు చెల్లింపుల మొత్తాన్ని తిరిగి రాబట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని ఆదేశిస్తూ లేఖ రాశారు.

లైసెన్స్ లేని బాణసంచా కంటైనర్, లారీ సీజ్



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తమిళనాడు శివకాశి నుంచి లైసెన్స్ లేకుండా బాణసంచాతో వచ్చిన కంటైనర్, లారీని తిరుపతి, రేణిగుంట పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడికి అందిన రహస్య సమాచారం మేరకు.. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి సిబ్బందితో కలిసి కొరమేనుగుంటలోని మిట్టూరు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద తనిఖీలు చేపట్టారు. శివకాశి నుంచి కంటైనర్‌లో తెప్పించిన రూ రూ.2.5 లక్షల విలువ చేసే 38 బాక్సుల బాణసంచా కనిపించింది. అదే సమయంలో రేణిగుంటలో పట్టుబడిన లారీలో తనిఖీ చేయగా రూ.2.8 లక్షల బాణసంచా దొరికింది. లైసెన్స్ లేకపోవడంతో రెండింటినీ సీజ్ చేశారు. మిట్టూరు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. లైసెన్సు లేకుండా బాణసంచా తెచ్చినా, విక్రయించినా, నిల్వ చేసినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. అలాంటి సమాచారం అందితే 112కు తెలియజేయాలని కోరారు.

తిరుచానూరు నుంచి మరిన్ని రైళ్లు



సీసీఐ శ్రీకాంత్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి మరిన్ని రైళ్లను నడపనున్నట్లు తిరుపతి చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఆయన సికింద్రాబాదు నుంచి వచ్చిన ప్రత్యేక రైలు ప్రయాణికులను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను పెంచినట్లు చెప్పారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్వహణ, పార్కింగ్ సమస్యల కారణంగా తిరుచానూరు స్టేషన్ నుంచి ప్రత్యేక రైళ్లతోపాటు ప్యాసింజర్లను నడపాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని తెలిపారు. ఇప్పటికే ఐదు ప్రత్యేక రైళ్లను ఈ స్టేషన్ నుంచి నడుపుతున్నామని, మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చెన్నై, అరక్కోణం వరకు మెము రైళ్లను రోజూ నడుపుతున్నామని తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట సీసీఐ చలపతి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాస్, రాజేంద్ర పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన వేప చెట్టు కొమ్మ

● భక్తులకు తప్పిన ప్రమాదం



కల్యాణ వెంకన్న ఆలయంలో విరిగిన చెట్టు కొమ్మ

చంద్రగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని భారీ వేప చెట్టు కొమ్మ అకస్మాత్తుగా విరిగిపడింది. అయితే భక్తులకు ప్రమాదం తప్పింది. గత రెండు రోజులుగా మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో వేపచెట్టు బాగా తడిసింది. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ధ్వజస్తంభం నుంచి బలిపీఠం వరకు విస్తరించి ఉన్న భారీ వేపకొమ్మ విరిగి పడింది. దీంతో ఆలయ ఆవరణలోని విద్యుత్ తీగలు, ఇనుప పైపులు, పందిరిపై పడటంతో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఘటన జరిగిన సమయంలో భక్తుల రద్దీ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. తక్షణమే అధికారులు, సిబ్బంది విరిగిన కొమ్మలను తొలగించారు.

దూరవిద్య ఉద్యోగి మృతి



మునిశేఖర్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగ ఉద్యోగి మునిశేఖర్ (40) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లె పంచాయతీ ఎస్వీ నగర్‌కు చెందిన మునిశేఖర్ 20 ఏళ్లుగా ఎస్వీయూలో ఎన్ఎంఆర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మునిశేఖర్ మృతికి దూరవిద్య ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

'సీఎంఆర్' అగ్నికీలలు

● షార్ట్‌సర్క్యూట్‌తో ఆయిల్ పైపు అంటుకోవడంతో ప్రమాదం

● మూడు గంటల పాటు అదుపులోకిరాని మంటలు ● అస్వస్థతకు గురైన పలువురు కార్మికులు





సీఎంఆర్ కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు, అలుముకున్న పొగ - కంపెనీలో ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

ఏర్పేడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంచింతపాళెం రెవెన్యూ పరిధిలోని సీఎంఆర్ అల్యూమినియం ఈకో కంపెనీలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆయిల్‌పైపు లీకు కావడం.. షార్ట్‌సర్క్యూట్ జరగడంతో ఆ ఆయిల్ అంటుకొని మంటలు చెలరేగినట్లు పరిశ్రమ వర్గాలు, అధికారులు చెబుతున్నారు. ఈ మంటలను గుర్తించి కార్మికులు బయటకు పరుగుతీశారు. అప్పటికే దట్టంగా పొగ అలుముకోవడంతో ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిపడి కొందరు అస్వస్థతకు గురయ్యారు. వీరిని తిరుపతి, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు తరలించారు. మరోవైపు పరిశ్రమంలోని ఇంజన్ల ద్వారా మంటలను అదుపుచేసేందుకు యత్నించినా సాధ్యపడలేదు. దీంతో 112కు ఫోన్ చేసి కంపెనీ



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

అధికారులు తిరుపతి, వెంకటగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి ఫైర్‌ఇంజన్లను రప్పించారు. సుమారు మూడు గంటల పాటు కష్టపడి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో చింతపాళెం, రాజులపాళెం గ్రామాల్లోనూ పొగ అలుముకుంది. వెంకటగిరికి వెళ్లే వాహనదారులూ ఇబ్బంది పడ్డారు. మరోవైపు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టారు.

అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం

ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమ లోపల 300 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లారు. సాయంత్రం ఐదున్నర గంటలకు బయటకు రావాలి. 5 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. అందరూ అప్రమత్తమై బయటకు పరుగు తీయడంతో ప్రాణనష్టం తప్పింది.

అట్టహాసంగా 'మోహన మంత్ర'

● ఎంబీయూలో ఆకట్టుకున్న ఈవెంట్లు





చంద్రగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మోహన మంత్ర మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎంబీయూ ప్రొ.ఛాన్సలర్ విష్ణు మంచు ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంచు విష్ణు మాట్లాడుతూ ఎంబీయూ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం నిర్వహించే మోహన మంత్ర కార్యక్రమం విద్యార్థుల సాంస్కృతిక వేడుక అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడానికే ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్లను ఆయన స్వయంగా వెళ్లి తిలకించారు. కొన్ని ఈవెంట్లలో మంచు విష్ణు పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

ఆకట్టుకున్న ఈవెంట్లు

మోహనమంత్ర కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు టెక్నోహాలిక్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంబెడెడ్ వర్క్‌షాప్, కోడ్ ప్రింట్, లైఫ్ సేవర్, ఈవీ వర్క్‌షాప్‌లు, టెక్ ఎక్స్ ప్రోటోటైప్, ఈవీ ఎక్స్‌క్యూజోనోమిక్స్‌లు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్లలో భాగంగా లెట్స్ నాచో, చికెన్ డిన్నర్(పబ్జీ), కరోకే కెచప్, పుష్ అప్ ఛాలెంజ్, ఎం ప్రాజా ఈవెంట్లు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఫ్రీ ఫైర్, గల్లీ క్రికెట్, మిక్స్ బాస్కెట్ బాల్, ట్రెజర్ హంట్, లక్కీ డ్రా, ఫన్ గేమ్స్, ఫుడ్ ఛాలెంజ్, జార్బింగి బాల్స్ వంటి ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కేరింతల నడుమ మొదటి రోజు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్‌ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, చీఫ్ గ్రోత్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు పాల్గొన్నారు.



డ్రమ్స్ శివమణి కార్యక్రమంలో విద్యార్థుల ఈలలు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు నరసింహయాదవ్, సుగుణమ్మ తదితరులు

జీఎస్టీ 2.0 సేల్స్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన

తిరుచానూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో శుక్రవారం ప్రదర్శించిన జీఎస్టీ 2.0 సేల్స్ ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రారంభించారు. రాష్ట్ర జీఎస్టీ శాఖ, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో వంట సామగ్రి, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, కార్లు, స్కూటర్లు, సోలార్ తదితర వస్తువులకు సంబంధించి సుమారు 30స్టాల్స్ ఏర్పాటు చేశారు. తగ్గిన జీఎస్టీ వివరాలను వినియోగదారులకు నిర్వాహకులు వివరించారు. ఈ స్టాల్స్‌ను రీజనల్ జీఎస్టీ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర పరిశీలించారు. తగ్గిన ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్‌రాజు, నాయకులు కేవీ చౌదరి, వాసవి ఏజెన్సీ అధినేత ఏవీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరాలయం పాలకమండలి ప్రమాణ స్వీకారం



చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మనాభరాజు

నాగలాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర ఆలయ పాలక మండలి శుక్రవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో చైర్మన్‌గా పిచ్చాటూరు మండలం కీళపూడికి చెందిన టీడీపీ నేత పద్మనాభరాజు, సభ్యులుగా హంస, శ్రీనివాసులు, జయంతి, నెల్సన్ మండేలా, దేవి, కవిత, హేమంత్‌కుమార్, నాగభూషణమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. కాగా పాలకమండలి నియామకానికి ప్రభుత్వం గురువారం రాత్రి జీవో విడుదల చేయగా శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఈవోకు ఉత్తర్వులు అందాయి. గంటల వ్యవధిలోనే సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సత్యవేడు మండలానికి చెందిన కృష్ణయ్య యాదవ్ పదవీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈయన చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మాజీ ఎంపీపీ మధుబాల, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సతీష్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జయచంద్రనాయుడు, నాయకులు బాలరాజు, రామకృష్ణమరాజు, బుజ్జినాయుడు, రామచంద్రరాజు, దుష్యంతరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సన్నిధిలో నూతన పాలక మండలి సభ్యులు

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష

● 15 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. మరో 15 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు

బాలాయపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిబంధలనకు విరుద్ధంగా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసిన రిటైర్డ్ తహసీల్దారుపై లోకాయుక్తలో కేసు నమోదైంది. 2019 అక్టోబరులో బాలాయపల్లి తహసీల్దారుగా నియమితులైన ఆదిశేషయ్య 18 నెలల పాటు ఆ మండలంలో విధులు నిర్వహించారు. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రామాపురం గ్రామంలోని ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామస్తులు 2023లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం రిటైర్డ్ అయిన తహసీల్దారు ఆదిశేషయ్యపై 1644/2023/బి1 నంబరుతో కేసు నమోదు చేసిన లోకాయుక్త విచారణకు ఆదేశించింది. ఇందు కోసం జాయింట్ కలెక్టర్‌ను విచారణాధికారిగా, గూడూరు ఆర్డీవోను రికార్డుల పరిశీలనకు ప్రజెంటేషన్ అధికారిగా నియమించింది.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్/ఓజిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ తీర్పునిచ్చారు. ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన వీరాస్వామి, పోలయ్య పొలం హద్దుల విషయమై 2017 ఏప్రిల్ 10వ తేదీన గొడవ పడ్డారు. ఈ క్రమంలో పోలయ్యపై వీరాస్వామితో పాటు గ్రామానికి చెందిన 9మంది కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆస్పత్రిలో పోలయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరాస్వామిపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ కేసును ఏపీపీ సుందరయ్య వాదించారు.

గువ్వల కాలనీలో యువకుడి హత్య



మెడపైన రక్తగాయంతో చికిత్స పొందుతున్న శ్రీహరి (చనిపోయేముందు)

రేణిగుంట, అక్టోబరు 10(ఆంధ్ర జ్యోతి): గువ్వల కాలనీలో యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. గువ్వల కాలనీలో ఉంటున్న ఓ మేస్త్రీ తన భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. స్థానికంగా ఉన్న కొంతమంది మేస్త్రీ పట్ల అవహేళనగా మాట్లాడడంపై మూడు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉదయం పక్కింటి వారితో మద్యం మత్తులో మేస్త్రీ ఘర్షణపడ్డాడు. ఆ సమయంలో మేస్త్రీని అడ్డుకునే క్రమంలో శ్రీహరి(16) ప్రయత్నించాడు. దీంతో పూసలు చుట్టే కత్తితో మేస్త్రీ అతడి మెడపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడిన శ్రీహరిని చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేశారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దర్శన్

తిరుమల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది.టీటీడీ బోర్డు సభ్యుడు దర్శన్ ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని తిరుపతిలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సీజేపై చెప్పు దాడి ఘటనకు.. మోదీ బాధ్యత తీసుకోవాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితులపై దాడులు పెరిగాయని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు దాడి జరిగిందని, వీటికి ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సీజేపై చెప్పు దాడి, హరియాణాలో ఎస్సీ డీజీపీపై అక్కడి బీజేపీ ప్రభుత్వం వేధింపులకు నిరసనగా ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి తిరుపతి ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. చింతా మాట్లాడుతూ సీజేపై చెప్పు దాడి ఘటనకు ప్రధాని సమాధానం చెప్పాలన్నారు. మన రాష్ట్రానికి చెందిన ఒక దళిత డీజీపీ హర్యానాలో అక్కడి ప్రభుత్వం పెట్టిన వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మన రాష్ట్రంలోనూ దళితులపై, దళిత అధికారులపై దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. వీటిని కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపిగౌడ్, రవి, రావణ్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలుపుతున్న చింతా మోహన్

